సాక్షి
వికారాబాద్
మంగళవారం । 25 । మార్చి । 2025



'విచారణ'కరం!

విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో అధికారులు ఇచ్చిన నివేదికపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. 8లో ▸



'గృహజ్యోతి' భారం!

వేసవి ప్రారంభమైన నేపథ్యంలో ఎండ వేడిమికి ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళవారం సా. 6.34 గం.	బుధవారం ఉ. 4.54 గం.

న్యూస్‌రీల్

ప్రజావాణి అర్జీలను సత్వరం పరిష్కరించండి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలు సమస్యలపై 116 అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీఓ వాసుచంద్ర, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'కల్యాణలక్ష్మి' పేదలకు వరం

ఎమ్మెల్యే కాలె యాదయ్య



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలకు వరమని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో తొమ్మిది మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆడపిల్లలు ఉన్న తల్లిదండ్రులు వారికి పెళ్లి చేయడం ఎంతో భారం అన్నారు. ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో అండగా నిలుస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గీతాసింగ్ నాయక్, తహసీల్దార్ జైరాం, నాయకులు ప్రభాకర్, సుధాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, లింగం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌ను ఆపండి

ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మల్కాపూర్ గ్రామస్తులు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన పత్రాన్ని చూపుతున్న మల్కాపూర్ వాసులు

తాండూరు రూరల్: మండలంలోని మల్కాపూర్ ప్రభుత్వ భూమిలో అక్రమ మైనింగ్ జరుగుతోందని.. వెంటనే అరికట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామ సర్వే నంబర్ 72లో 18ఎకరాల 22గుంటల అసైన్డ్ భూమి ఉందన్నారు. గతంలో ఈ భూమిని ప్రభుత్వం కొంత మంది పేదలకు సాగు చేసుకునేందుకు ఇచ్చిందన్నారు. అట్టి భూమి(దాదాపు పది ఎకరాల్లో)లో పెద్ద ఎత్తున నాపరాతి తవ్వకాలు జరుగుతున్నాయని కలెక్టర్ దృష్టికి తెచ్చారు.

మైనింగ్ ఏడీ బెదిరిస్తున్నారు

అక్రమ మైనింగ్ గురించి ఆ శాఖ ఏడీ సత్యానారాయణ దృష్టికి తేగా తమను బెదిరిస్తున్నారని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే ఏడీ మాత్రం రెవెన్యూ అధికారులు ఎన్‌ఓసీ ఇవ్వడంతో వారం రోజుల క్రితం లీజుకు వచ్చాయని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో తుకారం, మహేందర్‌రెడ్డి, అరవింద్, మనోజ్, నిఖిల్ ఉన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి: డీఈఓ

తాండూరు: పదో తరగతి పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేదిలేదని డీఈఓ రేణుకాదేవి హెచ్చరించారు. సోమవారం తాండూరులోని పలు పరీక్ష కేంద్రాలను సందర్శించారు. పరీక్ష తొలి రోజు ప్రశ్నపత్రాలు మార్చి ఇవ్వడంపై అసహనం వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్‌లో ప్రశ్నపత్రాలు తీసుకునే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆమె వెంట ఎంఈఓ వెంకటయ్యగౌడ్ ఉన్నారు.

రేపు వాహనాల వేలం

అనంతగిరి: వికారాబాద్‌లోని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో బుధవారం 148 వాహనాలను బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్పీ నారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలతోపాటు గుర్తు తెలియని వ్యక్తులు వదిలేసిన వాటికి వేలం వేయనున్నట్లు తెలిపారు. ఎవరికైనా అభ్యంతరం, యాజమాన్య హక్కులు ఉంటే తమను సంప్రదించాలని సూచించారు. వాహన వివరాలు పోలీసు సోషల్ మీడియా ఫెస్‌బుక్, వాట్సాప్‌లో పొందుపరిచినట్లు తెలిపారు.



కొడంగల్: పట్టణ పరిధిలోని జాతీయ రహదారిపై కూలిన సూచిక బోర్డు



దుద్యాల్‌లో కురుస్తున్న భారీ వర్షం

గాలివాన బీభత్సం

దుద్యాల్ మండలంలో భారీ వర్షం

- పాఠశాల ఆవరణలో పిడుగుపాటు
- విద్యార్థులు లేకపోవడంతో తప్పిన ముప్పు
- ఈదురు గాలులకు నేలకొరిగిన చెట్లు



దుద్యాల్ సమీపంలో పడిపోయిన చెట్టు



అల్లిఖాన్‌పల్లిలో విద్యుత్ తీగలపై పడిన చెట్టు



కొడంగల్ బస్టాండ్‌లో కూలిన షెడ్డు



దుద్యాల్‌లో పిడుగుపాటుకు కాలిన చెట్టు

దుద్యాల్: మండలంలో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. దుద్యాల్ సమీపంలో పెద్ద చెట్లు నేలకొరిగాయి. అల్లిఖాన్‌పల్లి సమీపంలోని ఓ పొలంలో కరెంటు స్తంభంపై చెట్టు పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దుద్యాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని విద్యావనరుల కేంద్రం పక్కనే ఉన్న చెట్టుపై పిడుగు పడింది. దీంతో చెట్టు కాలిపోయింది. ఒంటిపూట బడి కావడంతో విద్యార్థులు లేరు. దీంతో పెను ప్రమాదం తప్పింది. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో మామిడి కాయలు రాలిపోయాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు.

కొడంగల్ పట్టణంలో..

కొడంగల్: పట్టణంలో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పట్టణ శివారు కొడంగల్ – హైదరాబాద్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన భారీ సూచిక బోర్డు గాలికి కూలిపోయింది. దీంతో గంటకుపైగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సూచిక బోర్డును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులు కూర్చునే షెడ్డు ఈదురు గాలులకు నేలకొరిగింది. భారీ వర్షంతో ప్రజలు, వ్యాపారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

బొంరాస్‌పేట మండలంలో..

బొంరాస్‌పేట: మండలంలోని వడిచర్ల గ్రామంలో సోమవారం మధ్యాహ్నం వడగళ్ల వాన కురిసింది. భారీ వర్షానికి పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ నీరు చేరింది. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. కొత్తూరు, నాగిరెడ్డిపల్లి, రేగడిమైలారం, లింగన్‌పల్లి, తదితర గ్రామాల్లో అకాల వర్షం కురిసింది.

'ఓపెన్'.. షెడ్యూల్ వచ్చేన్

వచ్చే నెల 20 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

- రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల పరిధిలో 48 పరీక్ష కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 10,218 మంది విద్యార్థులు
- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు



ఓపెన్ టెన్త్ పరీక్షలు ఇలా..

తేదీ	9-12 గంటల వరకు	2.30- 5.30 గంటల వరకు
20	తెలుగు, కన్నడ, తమిళం	ఫిజియోలజీ, మరాఠీ
21	ఆంగ్లం	ఇండియన్ కల్చర్ అండ్ హెరిటేజ్
22	గణితం (మ్యాథమటిక్స్)	బిజినెస్ స్టడీస్
23	సైన్స్ అండ్ టెక్నాలజీ	హిందీ
24	సోషల్‌స్టడీస్	ఉర్దూ
25	ఎకనామిక్స్	హోంసైన్స్
26	ఆల్ ఒకేషనల్ సబ్జెక్టులు థియరీ	ఆల్ ఒకేషనల్ సబ్జెక్టులు ప్రాక్టికల్స్

ఓపెన్ ఇంటర్ పరీక్షలు ఇలా..

తేదీ	9-12 గంటల వరకు	2.30-5.30 గంటల వరకు
20	తెలుగు, ఉర్దూ, హిందీ	అరబిక్
21	ఆంగ్లం	సోషియాలజీ
22	పొలిటికల్‌సైన్స్	కెమిస్ట్రీ, పెయింటింగ్
23	కామర్స్/బిజినెస్ స్టూడెంట్స్	ఫిజిక్స్, ఫిజియోలజీ
24	హిస్టరీ	గణితం, జియోగ్రఫీ
25	ఎకనామిక్స్, మాస్ కమ్యూనికేషన్	బయోలజీ, అకౌంటెన్సీ, హోం సైన్స్
26	ఆల్ ఒకేషనల్ సబ్జెక్టులు	-

కేశంపేట: ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్షలు ఏప్రిల్ 20నుంచి నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30నుంచి 5.30గంటల వరకు పరీక్షల సమయం ఉంటుంది. రంగారెడ్డి జిల్లాలో పదో తరగతికి పది పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల పరిధిలో 2,158మంది విద్యార్థులు, ఇంటర్మీడియెట్‌కు 13 పరీక్ష కేంద్రాల పరిధిలో 2,965 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వికారాబాద్ జిల్లాలో పదో తరగతికి మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల పరిధిలో 597 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఇంటర్మీడియెట్‌కు ఐదు పరీక్ష కేంద్రాల పరిధిలో 973 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. మేడ్చల్ జిల్లా పరిధిలో పదో తరగతికి ఏడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1,482 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పది పరీక్ష కేంద్రాల పరిధిలో 2,043 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరుకానున్నారు. ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు ఏప్రిల్ 26 నుంచి మే 3వరకు ఉండనున్నాయి. పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్టు రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ సత్యనారాయణ తెలిపారు.

పేదల భూములు లాక్కుంటే ఊరుకోం

- కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్య గౌడ్

మహేశ్వరం: ఫ్యూచర్ సిటీ పేరుతో పేద రైతుల భూములు తీసుకుంటే ఊరుకునే ప్రసక్తి లేదని, వారి పక్షాన బీజేపీ ఉద్యమిస్తుందని కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్య గౌడ్ హెచ్చరించారు.మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని, మహేశ్వరాన్ని మహానగరంగా తీర్చిదిద్దుతామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫార్మాసిటీకి భూ సేకరణ కోసం సుమారు 30 వేల ఎకరాలను పేదల నుంచి గత, ప్రస్తుత ప్రభుత్వాలు తీసుకున్నాయని ఆ భూమిలో అభివృద్ధి చేయాలని కోరారు. అభివృద్ధి పేరుతో పేదల భూములను లాక్కొని పెట్టుబడిదారులకు అధిక ధరకు విక్రయించి, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. ఫ్యూచర్ సిటీ, 350 ఫీట్ల రేడియల్ రోడ్ల నిర్మాణం పేరుతో పేదల భూములు బలవంతంగా లాక్కుంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, పార్టీ చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్లు అనంతయ్య గౌడ్, కుంచె వెంకటేశ్, మండల అధ్యక్షుడు టి.యాదీష్, గిరిజనమోర్చా రాష్ట్ర నాయకుడు దేశ్యా నాయక్, కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకుడు కాసాని వెంకటేశ్ గౌడ్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బస్వ పాపయ్య గౌడ్

నూతన నియామకం



నియామకపత్రం అందుకుంటున్న దర్శన్‌గౌడ్

మొయినాబాద్: గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ కార్యదర్శిగా మండలానికి చెందిన రేనట్ల దర్శన్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు నక్క కృష్ణగౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు రేనట్ల మల్లేష్‌గౌడ్ చేతులమీదుగా సోమవాం నగరంలోని లంగర్‌హౌస్‌లో ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా దర్శన్‌గౌడ్ మాట్లాడుతూ.. గౌడ కుల హక్కుల సాధనకు కృషి చేస్తానని, సంఘం అభివృద్ధికి తోడ్పాటు నందిస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌గౌడ్, ప్రభాకర్‌గౌడ్, స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం దిమ్మె కూలి చిన్నారి మృతి

అల్లాపూర్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఘటన



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్



సాయితేజ(ఫైల్)

కుల్కచర్ల: ఉపాధి హామీ పనుల వివరాలు తెలియజేసేశిలాఫలకం దిమ్మె ఓ చిన్నారి ప్రాణాన్ని పొట్టన పెట్టుకుంది. ఈ ఘటన కుల్కచర్ల మండలం అల్లాపూర్‌లో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన విస్లావత్ లక్ష్మణ్, నవనీత దంపతులకు ఇద్దరు ఆడ పిల్లలు, ఇద్దరు అబ్బాయిలు సంతానం. భార్యాభర్తలిద్దరూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అందరిలో చిన్నవాడైన సాయితేజ(4) ఉదయం 8:30 గంటలకు సహచర మిత్రులతో కలిసి స్థానిక అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్లాడు. ఉపాధి పనుల వివరాలు తెలియజేస్తూ భవనం ఎదుట ఏర్పాటు చేసిన దిమ్మె వద్ద ఆడుకుంటుండగా.. అప్పటికే పగుళ్లు పెట్టిన సిమెంట్ దిమ్మె విరిగి సాయితేజ తలపై పడింది. దీంతో చిన్నారి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

అధికారుల నిర్లక్ష్యం

ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ సెంటర్ ఎదుట పదేళ్ల క్రితం నిర్మించిన ఉపాధి హామీ శిలాఫలకం దిమ్మె విరిగిపోయి ప్రమాద భరితంగా మారింది. దీన్ని ఎవరూ పట్టించుకోలేదు. ఇదిలా ఉండగా ఆరు నెలల క్రితమే అంగన్‌వాడీ టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేయడంతో ఆయాగా విధులు నిర్వర్తిస్తున్న కమ్లీబాయి సెంటర్‌ను నడిపిస్తున్నారు. అల్లారుముద్దుగా చూసుకుంటున్న తమ కొడుకు విగత జీవిగా మారడాన్ని చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు. పరిగి ఎస్‌ఐ సంతోష్‌కుమార్ గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేస్తాం

బాలుడి మృతిపై స్థానిక ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి జింకల యాదయ్య, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్‌కుమార్, రవి తదితరులను పంపించి, బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. మృతుడి తల్లికి అంగన్‌వాడీలో ఉద్యోగం కల్పించేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి జింకల యాదయ్య, బ్లాక్ బి అధ్యక్షులు భరత్ కుమార్, రవి తదితరులు ఉన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే నిండుప్రాణం బలి

మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



బాలుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: పిల్లల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటమడుతోందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఆరోపించారు. కుల్కచర్ల మండలం అల్లాపూర్ తండాలో శిలాఫలకం దిమ్మె కూలి మృతి చెందిన చిన్నారి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. బాలుడి అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ..అధికారుల నిర్లక్ష్యంతోనే నిండు ప్రాణం బలైందన్నారు. ఎంతో భవిష్యత్ ఉన్న బాలుడు మృతి చెందడం బాధాకరమన్నారు.బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఇఫ్తార్ విందు

ఆహ్వాన పత్రికలు అందజేసిన బీఆర్ఎస్ నాయకులు



ఇఫ్తార్ విందు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

యాలాల: మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న ఇఫ్తార్ విందుకు ముస్లింలు తరలిరావాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ కుమార్, బీఆర్ఎస్ రైతు సంఘం అధ్యక్షుడు అరవింద్‌కుమార్ కోరారు. ఈ మేరకు వారు సోమవారం వారు గ్రామాల్లో పర్యటించి మైనార్టీ నేతలకు ఆహ్వానపత్రికలు అందజేశారు. తాండూరు పట్టణంలోని క్లాసిక్ గార్డెన్‌లో ఈ విందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అనుమతి లేని కంపెనీపై చర్యలకు వినతి

ధారూరు: పంచాయతీ అనుమతి లేకుండా కొనసాగుతున్న చార్లీ టెక్స్‌టైల్స్ ప్రింటింగ్ ప్రైవేటు ఇండియా కంపెనీని వెంటనే మూసేయాలని బాధిత గ్రామాల ప్రజలు, కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. 2010లో ఎలాంటి పర్మిషన్ లేకుండా ఈ కంపెనీని ఏర్పాటు చేశారని, దీని నుంచి వెలువడుతున్న కాలుష్యంతో తాము వ్యాధుల బారిన పడుతున్నామని డీకేతండా, స్టేషన్‌ధారూరు, ఎల్ఎన్‌తండాల వాసులు పేర్కొన్నారు. సదరు కంపెనీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్టేషన్‌ధారూరు మాజీ ఉప సర్పంచు యాదయ్య, ప్రజలు కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు విజ్ఞప్తి చేశారు.

ఉలిక్కిపడిన మహేశ్వరం

- అడ్వకేట్ ఇజ్రాయిల్ హత్యతో విషాదఛాయలు
- నేడు స్వగ్రామం తుమ్మలూరులో అంత్యక్రియలు



ఇజ్రాయిల్(ఫైల్)

మహేశ్వరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రాష్ట్ర మాజీ డైరెక్టర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, న్యాయవాది ఎర్రవాపు ఇజ్రాయిల్‌ను నగరంలోని చంపాపేట్ పరిధి న్యూ మారుతీనగర్‌లో సోమవారం దస్తగిరి అనే వ్యక్తి కత్తులతో పొడిచి హత్య చేశాడు. ఈ హత్యతో మహేశ్వరం ఉలిక్కిపడింది. కందుకూరు, ఇబ్రహీంపట్నం మండలాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న మండల వాసులు, న్యాయవాదులు, కాంగ్రెస్ నాయకులు హుటాహుటినా అపోలో, ఉస్మానియా ఆస్పత్రికి చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్ఆర్, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, జెడ్పీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను, పోలీసులను, వైద్యులతో మాట్లాడి ఘటన తీరును తెలుసుకున్నారు. మృతుడు మాజీ మంత్రి ఇంద్రారెడ్డి, సబితారెడ్డికి సన్నిహితంగా ఉంటూ కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా పని చేశారు. సబితారెడ్డి 2019లో కాంగ్రెస్‌ను వీడినా ఆయన పార్టీలోనే కొనసాగారు. మహేశ్వరం కోర్టు బార్ అసోషియేషన్ అధ్యక్షుడిగా మహేశ్వరానికి కోర్టు తీసుకురావడంతో ఆయన కీలక పాత్ర పోషించాడు. న్యాయవాదిగా పేదలకు ఉచితంగా న్యాయ సేవలు, సలహాలు అందించేవారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ రాష్ట్ర డైరెక్టర్‌గా పని చేశారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే కేఎల్లాఆర్ రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టుకు సైతం ఇజ్రాయిల్ పేరును ప్రతిపాదించారు. మంగళవారం ఆయన స్వగ్రామం తుమ్మలూరులో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

పేదల భూములు లాక్కుంటే ఊరుకోం

కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్య గౌడ్

మహేశ్వరం: ఫ్యూచర్ సిటీ పేరుతో పేద రైతుల భూములు తీసుకుంటే ఊరుకునే ప్రసక్తి లేదని, వారి పక్షాన బీజేపీ ఉద్యమిస్తుందని కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్య గౌడ్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని, మహేశ్వరాన్ని మహానగరంగా తీర్చిదిద్దుతామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫార్మాసిటీకి భూ సేకరణ కోసం సుమారు 30 వేల ఎకరాలను పేదల నుంచి గత, ప్రస్తుత ప్రభుత్వాలు తీసుకున్నాయని ఆ భూమిలో అభివృద్ధి చేయాలని కోరారు. అభివృద్ధి పేరుతో పేదల భూములను లాక్కొని పెట్టుబడిదారులకు అధిక ధరకు విక్రయించి, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. ఫ్యూచర్ సిటీ, 350 ఫీట్ల రేడియల్ రోడ్ల నిర్మాణం పేరుతో పేదల భూములు బలవంతంగా లాక్కుంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, పార్టీ చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్లు అనంతయ్య గౌడ్, కుండె వెంకటేశ్, మండల అధ్యక్షుడు టి.యాదీష్, గిరిజనమోర్చా రాష్ట్ర నాయకుడు దేశ్యా నాయక్, కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకుడు కాసాని వెంకటేశ్ గౌడ్ పాల్గొన్నారు.

'విచారణ'కరం!

- గురుకుల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం ఘటన నివేదికపై విమర్శలు
- బాధితురాలినే దోషిగా చూపడం అన్యాయమంటున్న ప్రజాసంఘాలు
- ఏకపక్షంగా విచారణ నిర్వహించారని ఆరోపణలు
- నివేదికలో పేర్కొన్నవన్నీ నిందలేనని బాధితుల ఆవేదన



ఆత్మహత్యకు యత్నించిన బాలిక(ఫైల్)

వికారాబాద్: ఉపాధ్యాయుల వేధింపులు భరించలేక ఓ గురుకుల విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో అధికారులు ఇచ్చిన నివేదికపై ప్రజాసంఘాలు, బాలల హక్కుల నేతలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. కొత్తగడి గురుకుల పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని తబిత స్కూల్ భవనం పైనుంచి దూకింది. దీంతో బాలిక కాలు విరిగి, ప్రాణాలతో బయటపడింది. విద్యార్థిని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు ఆందోళన చేయడంతో స్పందించిన బీసీ కమిషన్ ఈ ఘటనపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించింది. దీంతో ఎంక్వైరీ కమిటీ వేసిన కలెక్టర్ వారిచ్చిన నివేదికను బీసీ కమిషన్‌కు పంపించారు. ఉపాధ్యాయుల వేధింపుల కారణంగానే తానలా చేశానని బాలిక చెబుతున్నా.. బాధితురాలినే ఘటనకు బాధ్యురాలిగా చేస్తూ నివేదిక ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ నుంచి వివరాలు సేకరించిన విచారణ అధికారులు బాధిత విద్యార్థితో కానీ ఆమె తల్లిదండ్రులతో కానీ ఒక్కసారి కూడా మాట్లాడే ప్రయత్నం చేయలేదు.

నివేదికలో ఏం చెప్పారంటే..

- బాధిత విద్యార్థిని సున్నిత మనస్తత్వాన్ని కలిగి ఉంది.
- రికార్డులు పూర్తి చేయలేదు.. పరీక్షలు రాసేందుకు ఆసక్తి చూపడం లేదు.. విద్యాపరంగా నిలదొక్కుకోవడంలో, చదువు సామర్థ్యాలను అందుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటోంది.
- క్లాసుల్లో తరచూ క్రమశిక్షణ చర్యలకు లోనయ్యేది.
- ఇటీవల పాఠశాలలో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఓ ఉపాధ్యాయుడు తన గురించి చెడుగా మాట్లాడాడని మరో విద్యార్థి ద్వారా తెలుసుకొని మానసిక క్షోభకు గురైంది.
- మరుసటి రోజే భవనం పైనుంచి దూకింది.

విద్యాహక్కు చట్టం ఏం చెబుతోంది?

- విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 17(1)(2)2ఎ(2)(జి) ప్రకారం కార్పొరల్ పనిష్మెంట్, మానసిక, శారీరక శిక్షలు, అవమానించటం, వేధింపులకు గురిచేయటం, తోటి విద్యార్థుల ముందు అవమానించేలా మాట్లాడటం వంటివి నేరం.
- కమిటీ ఇచ్చిన నివేదికలోని మూడు, నాలుగు పాయింట్లలో పైఅంశాలను పేర్కొన్నారు.
- రికార్డులు, పరీక్షలు సక్రమంగా రాయకపోవడంపై ఉపాధ్యాయులు అడగడం, ఓ టీచర్ తన గురించి చెడుగా, తక్కువ చేసి మాట్లాడటంతో క్షోభకు గురై ఆత్మహత్యకు ప్రయత్నించిందని నివేదికలో పేర్కొన్నారు.
- ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కానీ, మందలించాలని కానీ కమిషన్‌కు సిఫారసు చేయలేదు.
- ఇదిలా ఉండగా నివేదికలో పొందుపర్చిన అంశాలు వాస్తవం కాదని తెలుస్తోంది.. బాధిత విద్యార్థిని చదువు సామర్థ్యాలను అందుకోవడంలో ఇబ్బంది పడుతోందని పేర్కొన్నారు. కానీ సదరు బాలిక 8, 9 తరగతుల్లో ఏ గ్రేడ్‌లో పాసైనట్లు ఆమె ప్రోగ్రెస్ రిపోర్టులు చెబుతున్నాయి.

సమస్యలు చెప్పినందుకే..



సిమెంట్ దుకాణంలో కూలీ పనులు చేసుకుంటా. మా కూతురు మొదట్నుంచి ఫస్ట్ క్లాస్ స్టూడెంటే.. 8, 9 తరగతుల్లోనూ ఏ గ్రేడ్ లో పాసైంది. గతంలో మేము పాఠశాలకు వెళ్లిన సమయంలో మరుగుదొడ్లు సరిగ్గా లేవని చెప్పింది. ఈ విషయాన్ని మేము ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లాం. దీంతో నా కూతురుపై కక్ష పెంచుకున్న సిబ్బంది, ఆమెను టార్గెట్ చేసి వేధించారు. తీవ్ర మనసిక సంఘర్షణకు లోనుకావడంతోనే ఆత్మహత్యాయత్నం చేసింది. భవనం పైనుంచి దూకడంతో కాలు విరిగింది. స్కూల్ నుంచి పంపిన తర్వాత ఒక్కసారి కూడా బాలిక బాగోగుల గురించి పాఠశాల సిబ్బంది అడగలేదు. ఆమె వైద్యం కోసం రోజూ రూ.1,200 ఖర్చవుతోంది. మాకు న్యాయం చేయాలి.

– యాదయ్య, బాధిత విద్యార్థిని తండ్రి

చులకన చేసి మాట్లాడటం నేరం



బాలల విద్యాహక్కు చట్టం ప్రకారం చదువుకోవాలని ఒత్తిడి చేయడం, తోటి విద్యార్థుల ముందు చులకనగా మాట్లాడటం నేరం. బీసీ కమిషన్‌కు ఇచ్చిన నివేదికలో విద్యార్థినిని ఒత్తిడికి గురిచేసినట్టు స్పష్టమవుతోంది. ఈ రిపోర్టు ఆధారంగా కారణమైన ఉపాధ్యాయులను శిక్షించాలి.

– ఆర్ వెంకట్‌రెడ్డి, బాలల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్

'అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి'కి దరఖాస్తుల ఆహ్వానం

అనంతగిరి: డా.బీఆర్.అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద అర్హులైన ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎన్.మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం అర్హులైన విద్యార్థులు మంగళవారం నుంచి మే 19 వరకు తెలంగాణ ఈపాస్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. అమెరికా, కెనడా, జర్మనీ, యూకే, సింగపూర్, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాలలో ఉన్నత చదువుల కోసం వెళ్లే వారికి షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ రూ.20 లక్షల స్కాలర్ షిప్‌ను మంజూరు చేస్తుందన్నారు. దీనికి విద్యార్థులు విద్యార్హత పత్రాలు, కుటుంబ వార్షిక ఆదాయం(రూ.5 లక్షల లోపు) తదితర సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు కలెక్టరేట్‌లోని ఎఫ్–10 కార్యాలయంలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

వైన్స్‌లో చోరీ

పూడూరు: వైన్స్ తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధుసూదన్ రెడ్డి తెలిపిన ప్రకారం.. మన్నేగూడ గంగ వైన్స్‌లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వైన్స్ తాళాలు పగులగొట్టి రూ.50 వేల నగదు, 50 ఫుల్‌బాటిల్‌లను ఎత్తుకెళ్లారు. ఉదయం షాప్ ఓపెన్ చేసేందుకు వెళ్లగా తాళాలు పగులగొట్టి ఉండడంతో వైన్స్ యజమానికి సమాచారం ఇచ్చారు. సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. వైన్స్ యజమాని మల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేసవి కాలం.. 'గృహజ్యోతి' భారం!



దోమ విద్యుత్ సబ్ స్టేషన్

- ఎండలు మండుతున్న నేపథ్యంలో పెరగనున్న విద్యుత్ వినియోగం
- 200 యూనిట్లు మించితే పథకానికి దూరం
- విద్యుత్‌ను పొదుపుగా వాడాలని అధికారుల సూచన
- ఆందోళనలో వినియోగదారులు

దోమ: వేసవి ప్రారంభమైన నేపథ్యంలో ఎండ వేడిమికి ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఎండతాపం నుంచి ఉపశమనం పొందేందుకు ఏసీలు, ఫ్యాన్లు, కూలర్లను వినియోగదారులు వినియోగించుకుంటున్నారు. దీంతో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. మండల పరిధిలో నెలకు 6,47,000 యూనిట్ల విద్యుత్‌ను వినియోగిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కాగా, గృహజ్యోతి పథకం కింద వినియోగదారులు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందుతూ జీరో బిల్ పొందుతున్నారు. వేసవి దృష్ట్యా 200 యూనిట్లు దాటితే బిల్లు మరింత అదనపు భారం పడుతుందని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

15,132 కనెక్షన్లకు రూ.13.69 కోట్ల బిల్లులు

మండల వ్యాప్తంగా అన్ని 15,131 కనెక్షన్లు ఉండగా ప్రభుత్వం నెలకు సుమారు రూ.13.69 కోట్ల బిల్లులు చెల్లిస్తోంది. వీటిలో వ్యవసాయం, కంపెనీలు, గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాల బిల్లులు వస్తున్నప్పటికీ గృహ జ్యోతి బిల్లులు ప్రభుత్వం చెల్లిస్తోంది. వేసవి దృష్ట్యా విద్యుత్ వినియోగం పెరిగిపోడడంతో 200 యూనిట్లు దాటిన వారంతా బిల్లులు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.

6,796 మందికి లబ్ధి

మండల పరిధిలో గృహ విద్యుత్ వినియోగదారులు 8,531 ఉండగా ప్రభుత్వం జీరో బిల్ అమలు చేసిన నాటి నుంచి 6,796 మంది వినియోగదారులు లబ్ధి పొందుతున్నారు. మార్చి, ఏప్రిల్, మేలో ఎండలు పెరిగే అవకాశం ఉండగా మరింత అధికంగా బిల్ వచ్చే పరిస్థితులు నెలకొంటున్నాయి. విద్యుత్ వినియోగించే వారి సంఖ్య రెండు, మూడు నెలల్లో మరింత పెరగనుందని అధికారులు చెబుతున్నారు. తప్పనిసరిగా 200 యూనిట్లు దాటిన వారంతా విద్యుత్ బిల్లు చెల్లించాల్సిందేనని అధికారులు తేల్చి చెబుతున్నారు. ఈ క్రమంలో విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

జీరో బిల్లును అందిస్తున్నాం



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జీరో బిల్లును అమలు చేస్తోంది. కంపెనీలు, ప్రభుత్వ భవనాలు, వ్యవసాయ బిల్లులు అధికారులు, రైతుల వద్ద వసూళ్లు చేస్తూ ప్రభుత్వానికి చెల్లిస్తున్నాం. విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం.

– కృష్ణయ్య, విద్యుత్ లైన్‌మెన్, బొంపల్లి

పొదుపుగా వాడుకోవాలి



ఎండలు మండుతుండంతో విద్యుత్ వినియోగం పెరిగే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో ప్రతీ వినియోగదారుడు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి. ప్రభుత్వం ప్రస్తుతం అర్హులైన వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తుంది. 200 యూనిట్లు దాటితే వినియోగదారులు విద్యుత్ బిల్లును తప్పనిసరిగా చెల్లించాల్సి ఉంటుంది.

– వినయ్‌కుమార్, విద్యుత్ ఏఈ, దోమ

తేనెటీగల పెంపకాన్ని ప్రోత్సహించాలి



పందులు, కోతుల బెడద నివారణపై రైతులకు వివరిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

- పత్తి దిగుబడి మరింత పెంచుకునే అవకాశం
- రాజేంద్రనగర్ వ్యవసాయ శాస్త్రవేత్త సునీత



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త సునీత

ధారూరు: ఆరోగ్యానికి మేలు చేసే తేనెటీగల పెంపకాన్ని ప్రోత్సహించాల్సి ఉంటుందని రాజేంద్రనగర్ వ్యవసాయ శాస్త్రవేత్త సునీత అన్నారు. సోమవారం తాండూరు ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో అధిక సాంద్రత–పత్తి సాగుపై సెంట్రల్ ఇనిస్టిట్యూట్ కాటన్ రీసెర్చ్ వారి సౌజన్యంతో ధారూరు రైతు వేదికలో రైతులకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ సునీత మాట్లాడుతూ.. నాణ్యమైన తేనే యొక్క ప్రాధాన్యతను ఆమె వివరించారు. నేటి రోజుల్లో తేనెటీగలు అంతరించి పోకుండా వాటిని సంరక్షించుకోవడం మన బాధ్యత అన్నారు. అడవి పందులు, కోతుల నుంచి సాగుచేసిన పంటలను ఎలా కాపాడుకోవాలో వివరించారు. సీనియర్ సైంటిస్టు లక్ష్మణ్ మాట్లాడుతూ.. కొన్ని ఏళ్లుగా పత్తి దిగుబడి నిలకడగా ఉందని.. రైతులు శ్రమిస్తే మరింత దిగుబడిని సాధించుకోవచ్చని ఆయన సూచించారు. అధిక సాంద్రత ఆవశ్యకతను వివరించారు. జనవరిలో రెండో పంటగా పెసర, మినుము వేసుకుని అదనపు ఆదాయాన్ని పొందవచ్చునని ఆయన సూచించారు. శాస్త్రవేత్త సుధారాణి మాట్లాడుతూ.. పత్తిలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, పెరుగుదల నియంత్రణ, ఎరువుల మోతాదు, నీటి యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. ప్రస్తుత పంటల్లో జింక్ ధాతులోపం ఉంటుందని అన్నారు. ప్రస్తుతం సాగుచేసిన పంటల్లో జింక్‌ధాతు లోపం, సల్ఫైడ్ ఇంజూరీ లక్షణాలను గుర్తించామని వివరించారు. ఈ సమావేశంలో శాస్త్రవేత్త యమున, ధారూరు పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, ఏఓ సూర్యప్రకాశ్, ఏఈఓలు సంతోశ్, సంజూరాథోడ్, రైతులు పాల్గొన్నారు. అడవి పందులు, కోతుల బారి నుంచి రైతులు తమ పంటలను ఎలా కాపాడుకోవాలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు సోలార్, ఇతర పరికరాలతో క్షేత్ర ప్రదర్శన నిర్వహించగా శాస్త్రవేత్తలు నిశితంగా పరిశీలించారు.

మట్టి తొలగించేందుకు అనుమతించాలి

- ప్రజావాణిలో ఏన్కతల ఆయకట్టు రైతుల వినతి



అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆయకట్టు రైతులు

అనంతగిరి: గ్రామంలోని చిన్న చెరువులో ఒండ్రు మట్టి తొలగించేందుకు రైతులను అనుమతించాలని మోమిన్‌పేట మండలం ఏన్కతల ఆయకట్టు రైతులు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో విన్నవించారు. ఈ మేరకు అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. చిన్న చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి, బఫర్ జోన్‌లో భూమిని ఇతరులు ఆక్రమించారని.. ఈ విషయంలో ఇప్పటికే తహసీల్దార్, ఇరిగేషన్ డీఈ సంయుక్తంగా సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసి కందకం తవ్వించారని చెప్పారు. కానీ కొందరు అక్రమార్కులు కందకం పూడ్చివేసి అక్కడ ప్రభుత్వభూమిని ఆక్రమించుకున్నా అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించి ఏడీ, ఇరిగేషన్ అధికారులు సర్వే చేపట్టి హద్దులు ఏర్పాటు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.



ఏన్కతలలో ఉల్లిపంటను పరిశీలిస్తున్న మహేందర్‌రెడ్డి, అధికారులు

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

- మర్పల్లి ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

మోమిన్‌పేట: అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఏన్కతల, గోవిందాపూర్, మల్లారెడ్డి గూడెం, రాంనాథ్‌గుడుపల్లి గ్రామాల్లో కురిసిన వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అనంతరం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు సాగు చేసిన పంటల నష్టాన్ని వ్యవసాయాధికారులు, ఉద్యాన అధికారులు సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని సూచించారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఏఓ జయశంకర్, ఉద్యానాధికారి అక్షితరెడ్డి, ఆర్ఐ గోవర్ధన్, ఏఈఓలు శ్రీనివాస్, పెంటయ్య తదితరులు ఉన్నారు.

కిడ్నీ తొలగింపు ఆపరేషన్ సక్సెస్

తాండూరు: తాండూరు ప్రాంతంలో తొలిసారి అరుదైన ఆపరేషన్ చేసిన వైద్యులు జిల్లాలోనే రికార్డు సృష్టించారు. సోమవారం తాండూరు పట్టణంలోని బాలాజీ ఆస్పత్రిలో మహిళకు నిర్వహించిన కిడ్నీ శస్త్రచికిత్స విజయవంతమైంది. ఆసుపత్రి చైర్మన్, డాక్టర్ సంపత్‌కుమార్, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. యాలాల మండలం దుబ్బతండాకు చెందిన పుల్లీబాయి పదేళ్లుగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతోంది. తరచూ కడుపు నొప్పి రావడంతో కిడ్నీ పరీక్షలు చేయించుకొంది. కిడ్నీలో రాళ్లున్నాయని చెప్పడంతో మందులు వాడినా ఫలితం లభించలేదు. నగరంలోనూ పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందింది. ఇటీవల మరోమారు తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో భర్త బాబ్యానాయక్ తాండూరులోని బాలాజీ ఆస్పత్రికి తీసుకొచ్చాడు. పరీక్షించిన వైద్యులు ఓ కిడ్నీ పూర్తిగా పాడయిందని తొలగించాలని సూచించారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో పుల్లీబాయికి నలుగురు వైద్యబృందంతో కూడిన సర్జన్‌లు యూరాలజిస్ట్ సర్జన్ రణధీర్, అనస్తీషియన్ అశీష్, వైద్యులు నాగదివ్య, అగాధ, సిబ్బంది మహబూబ్, నూరీల సమక్షంలో శస్త్ర చికిత్స నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంపత్‌కుమార్ వైద్యబృందాన్ని అభినందించారు.

విమానాశ్రయం ఏర్పాటుకు వినతి

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు.

క్షయ రహిత జిల్లాగా ప్రకటిస్తాం



తాండూరు టౌన్: ర్యాలీ నిర్వహిస్తున్న నర్సింగ్ విద్యార్థినులు, వైద్య సిబ్బంది

- ఈ ఏడాది చివరి వరకు లక్ష్యం చేరుకుంటాం
- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీంద్రయాదవ్

తాండూరు టౌన్: ఈ ఏడాది చివరి వరకు క్షయ రహిత జిల్లాగా ప్రకటిస్తామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీంద్రయాదవ్ అన్నారు. సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో నర్సింగ్ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్షయ వ్యాధి నిర్మూలనకు తమ వంతు సహకారం అందిస్తామని విద్యార్థినులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా రవీంద్ర యాదవ్ మాట్లాడుతూ.. సకాలంలో వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకుంటే నయమవుతుందన్నారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు క్షయ వ్యాధి పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. 18 నుంచి 60 ఏళ్ల వయసున్న వారికి మాత్రమే ఏప్రిల్ మొదటి వారంలో వ్యాక్సిన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. క్షయ వ్యాధి గుర్తింపు కోసం జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు, పెద్దాసుపత్రుల్లో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సమీవుల్లా, డాక్టర్ గిరిధర్, సూపర్‌వైజర్ అంబిక, ఫార్మసిస్ట్ రవికుమార్, హర్షవర్ధన్ రెడ్డి, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు తదితరులు పాల్గొన్నారు.

క్షయ చికిత్స నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం



కొడంగల్ రూరల్: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న, వైద్య సిబ్బంది

కొడంగల్ రూరల్: క్షయ వ్యాధిగ్రస్తులు వైద్యుల సూచనల పాటించాలని.. నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ నిలిమేరి, టీబీ సూపర్‌వైజర్ రాహత్‌అలీ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా సోమవారం వైద్య కళాశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. రెండు వారాలకు మించి దగ్గు, ఆకలి మందగించడం, సాయంత్రం వేళ జ్వరం వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఉచిత పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని వివరించారు. సమయానికి మందులు వాడుతూ.. పౌష్టికాహారం తీసుకోవడంతో క్షయ వ్యాధి నయమవుతుందని చెప్పారు. ప్రభుత్వాస్పత్రిలో టీబీకి సంబంధించి ట్రూనట్, మైక్రోస్కోపి టెస్టులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయిన వ్యక్తులకు ఆరు నెలలు ఉచితంగా మందులు అందించడంతోపాటు రోగికి పౌష్టికాహారం కోసం ప్రతీ నెల రూ.వేయి ఖాతాలో జమ చేస్తారని చెప్పారు.